హైదరాబాద్ వార్త



# మురికినాలాలపై సమగ్ర సర్వే చేయాలి

**-అధికారులకు జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి ఆదేశం**
**-పాత బస్తీలోని పలు ప్రాంతాల్లో నాలాల పరిశీలన**



యాకుత్‌పురా పర్యటనలో అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ ఇలంబర్తి, స్థానిక ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ తదితరులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 19,ప్రభాతవార్త:** మురికి నాలాల పై సమగ్ర సర్వే చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం యాకుత్‌పురా లోని పలు స్టార్మ్ వాటర్ డ్రెయిన్‌లను స్థానిక ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, కార్పొరేటర్ లతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ రంగేలి కిడికి, హుస్సేన్ కోటి, మోలానా చిల్ల, గంగా నగర్, రెయిన్ బజార్ లలో పర్యటించారు. ముందుగా రంగేలి కిడికి వీధిలో మురుగు నీరు ఓవర్ ఫ్లోను పరిశీలించారు. జహంగీర్ నగర్ నుండి గంగా నగర్ మురికి కాలువ నిజాం కాలంలో చేపట్టిన నాలా అయినందున గత వర్ష కాలంలో వరదకు పొంగిపోయిన నేపథ్యంలో మురికి నీరు వస్తున్నాయని మెయింటెనెన్స్ ఈఈ కమిషనర్‌కు వివరించడంతో మురుగు నీటి నాలా పై సమగ్ర సర్వే చేయాలని, నిజాం కాలం నాటి మురికి కాలువ అయినందున నాలాల పరిస్థితి తెలుసుకోవలసిన అవసరం ఉందని సమగ్ర సర్వే చేసి పూర్తి నివేదిక అందజేయాలని ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత మోలానా చిల్ల వద్ద గంగా నగర్ నాలాను పరిశీలించారు. నాలా పనులు మూడేళ్ల నుండి చేస్తున్నందున పూర్తి కాలేదని ఎమ్మెల్యే కమిషనర్ కు వివరించారు. నాలా పనులు కొనసాగుతున్న నేపథ్యంలో అట్టి పనులు పూర్తి చేయాలని ఏజెన్సీని కోరారు. నిధుల సమస్య లేదని పనులు నిర్దేశించిన కాల వ్యవధిలో పూర్తి చేయాలన్నారు. నాలాలో చెత్త పేరుకుపోయి నీరు నిలిచి ఇళ్లలోకి రావడం వలన ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెప్పడంతో వెంటనే తొలగించాలని జోనల్ కమీషనర్ కు కమిషనర్ ఆదేశించారు. రెయిన్ బజార్ ఎగ్జిస్టింగ్ బాక్స్ డ్రెయిన్ లో వర్షపు నీరు వెళ్లక వరద నీటి నిలిచిపోవడంతో ఇళ్లకు నీరు వస్తుందని కాలనీ వాసులు కమిషనర్ కు వివరించారు. దీంతో బాక్స్ డ్రెయిన్ పనులు చేపట్టేందుకు రూ.1.60 కోట్లతో ప్రతిపాదనలు పంపించినట్లు ఎమ్మెల్యే కమిషనర్‌ను కోరగా పని పూర్తి డీటైల్స్ రిపోర్ట్ పంపించాలని ఇంజనీరింగ్ అధికారిని ఆదేశించారు. టెండర్ పూర్తయిన తర్వాత పనులు యుద్ధప్రాతిపదికన ప్రజలకు ఇబ్బంది లేకుండా నిర్మాణ పనులు చేపట్టాలని కమిషనర్ సూచించారు.

**స్టార్మ్ వాటర్ నాలా మాస్టర్ ప్లాన్ తయారు చేయండి..**

రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ లాగానే, హైదరాబాద్ నగరం యొక్క వర్షపు నీటి పారుదల క్రమబద్ధమైన అభివృద్ధి, నిర్వహణ విస్తరణను నిర్ధారించడానికి నాలా అభివృద్ధికి మాస్టర్ ప్రణాళిక అవసరమని కమిషనర్ తెలిపారు. ఇది వరద తగ్గింపు పరిష్కరించడం తో పాటు ఇప్పటికే ఉన్న నాలాలను కొత్త పట్టణ విస్తరణతో అనుసంధానించడానికి సహాయపడుతుందన్నారు. పాత బస్తీలో ప్రజలకు ఇబ్బందులు ఉండకూడదనే ఉద్దేశ్యంతో ఎస్.ఎన్.డి.పి ద్వారా నాలా పనులు చేపట్టినట్లు తెలిపారు. నగరంలో రూ.545 కోట్ల వ్యయంతో ఎస్.ఎన్.డి.పి రెండో దశ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోగా టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. పాత బస్తీలో చేపట్టిన పనులు వచ్చే వర్షాకాలం వరకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# ఇంచార్జ్‌ల పాలన ఇంకెన్నాళ్లు..?

**-టిజిఎస్‌పిడిసిఎల్‌లో 14 నెలలుగా ఇంచార్జి డైరెక్టర్లు**
**-కీలక నిర్ణయాలు తీసుకోవడంలో తీవ్రమైన జాప్యం**
**-రెగ్యులర్ డైరెక్టర్లను నియమించాలంటున్న ఉద్యోగులు**




**హైదరాబాద్, ఫిబ్రవరి 19,ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యుత్ సంస్థల సీఎండీలుగా ఐఏఎస్ అధికారులను నియమించడంతోపాటు గత ప్రభుత్వం నియమించిన డైరెక్టర్లను తొలగించించి విషయం తెలిసిందే. అయితే అప్పుడు ఆయా విభాగాల్లో పనిచేసే ఉన్నతాధికారులను ఇంచార్జి డైరెక్టర్లుగా నియమించింది. అప్పుడే ఒకటిరెండు నెలల్లో రెగ్యూలర్ డైరెక్టర్లను నిమిస్తారని ప్రచారం జరిగినా ఆప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. ప్రభుత్వం కూడా డైరెక్టర్ల నియామకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయినప్పటికీ ఆదిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ముఖ్యంగా దక్షిణ డిస్కంలో ఆపరేషన్స్, ప్రాజెక్ట్, హెచ్ఎర్/ ఫైనాన్స్ విభాగాలకు రెగ్యులర్ డైరెక్టర్లు లేకపోవడంతో ఆయా విభాగాల్లో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలన్నా, కీలక ఫైళ్లు ముందుకు వెళ్లాలన్నా ఇంచార్జి డైరెక్టర్లు ఆ ఫైళ్లను సీఎండీ కార్యాలయానికి పంపిస్తూ చేతులు దులుపుకుంటున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనికి కారణం క్షేత్రస్థాయి పరిస్థితులపై ఇంచార్జి డైరెక్టర్లకు అవగాహన లేకపోవడంతో కీలక నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం నెలకొంటుంది. డివిజన్ స్థాయి నుంచి కార్పొరేట్ కార్యాలయంలోని డైరెక్టర్ల వద్దకు వెళ్లిన ఫైళ్లు తిరిగి క్షేత్రస్థాయికి వచ్చేందుకు మూడు, నాలుగువారాల గడువు పడుతోంది. పనితో సంబంధం లేకుండా ప్రతి ఫైల్‌ను సీఎండీ కార్యాలయానికి పంపిస్తున్నారే తప్పా వాటిపై ఎలాంటి నిర్ణయాలు తీసుకోకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో డైరెక్టర్ల నియామకంపై ప్రభుత్వం స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. డైరెక్టర్లు లేకపోవడంతో సీఎండీ కార్యాలయంపై ఒత్తిడి పెరుగుతుందని గతంలో ప్రధాన సమస్యలుంటే తప్పా జిల్లాలనుంచి కార్పొరేట్ కార్పొరేట్ కార్యాలయానికి రాని ఉద్యోగులు ఇప్పుడు వారంలో రెండు, మూడు సార్లు సీఎండీ వద్దకు వస్తున్నారని దీంతో సిఎండీ బిజిబిజిగా ఉంటున్నారని తెలుపుతున్నారు. అలాగే ఇంచార్జి డైరెక్టర్ల పనితీరుపై పలువురు సీనియర్ సీఈ, ఎస్ఈలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా విద్యుత్ సంస్థల్లో కీలకమైన డైరెక్టర్ల నియామకంపై నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

# అసలు ధర ఒకటైతే.. ప్యాకింగ్‌పై మరోరేటు

**-షాపింగ్ మాల్స్‌లో వ్యాపారుల ఇష్టారాజ్యం**
**-లీగల్‌మెట్రాలజీ రూల్స్‌కు విరుద్ధంగా అధిక ధరలతో స్టిక్కర్లు**
**-అక్రమాలను అరికట్టాలని వినియోగదారులు గగ్గోలు**
**-నామమాత్రపు దాడులతో సరిపెడుతున్న తూనికలు కొలతలశాఖ**



**హైదరాబాద్,ఫిబ్రవరి 19,ప్రభాతవార్త:** ఇటీవల కాలంలో నగరంలోని షాపింగ్స్ మాల్స్ అడ్డగోలు రేట్లతో వినియోగదారులను మోసం చేస్తూ రెచ్చిపోతున్నాయి. ప్యాకింగ్‌పై ఉన్న అసలు ధరపై అధిక ధరతో కూడిన స్టిక్కర్ అంటించి విక్రయిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం బంజారా హిల్స్ లోని ఓ పేరుగాంచిన షాపింగ్ మాల్‌లోని తినుబండారాల దుకాణాలపై దాడులు జరుపగా మూడురెట్లు అధికంగా వసూలు చేస్తున్నట్లు తేలింది. అదే ప్రాంతంలోని మరో రెస్టారెంట్‌పై దాడులు జరపగా జీఎస్టీతోపాటు సర్వీస్ టాక్స్ పేరుతో వినియోగదారులను మోసం చేస్తున్నట్లు లీగల్ మెటరాలజీ అధికారులు గుర్తించారు. కేవలం ఇవే కాకుండా నగంలోని చాలా మాల్స్‌లో ఇదే పరిస్థితి నెలకొంది. తూనికలు కొలతల అధికారులు పదేపదే దాడులు జరిపి జరిమానా విధించి కేసులు పెట్టినా వ్యాపారుల్లో మాత్రం మార్పురావడం లేదు. దీనికి కారణం వినియోగదారుడికి జీఎస్టీపై పూర్తిగా అవగాహన లేకపోడం, తెలిసిన వారు కూడా ప్రశ్నించకపోవడంతో వ్యాపారుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతుంది. నగర జనం ఎక్కువగా వస్త్రాల కొనుగోలుకు గానీ, ఇంట్లోకి కావాల్సిన పదార్థాలను షాపింగ్ మాల్స్ లోనే కొనుగోలు చేడానికి ఇష్టపడుతారు. దీనిని ఆసరాగా చేసుకుంటున్న వ్యాపారులు తమ ఇష్టానుసారంగా తమకు అనుకూల మైన రేట్లతో స్టిక్కర్లను ము ద్రించి అధిక ధరలకు అమ్ముతున్నారు. ఈదందా కేవలం షాపింగ్ మాల్స్ లోనే కాకుండా పెద్దపెద్ద సినీమాల్స్, క్లాత్,డ్రెస్ షారూంలలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

**థియేటర్లలో...**

నగరంలోని కొత్తపేట ప్రాంతానికి చెందిన రమా శంకర్ థియోటర్‌లో తనకు జరిగిన అన్యాయాన్ని ప్రభాతవార్త ప్రతినిధికి వివరిస్తూ ... బుధవారం కుటుంబంతో కలిసి దిల్‌షుఖ్‌నగర్‌లోని ఓథియేటర్ కు సినిమాకు వెళ్ళాను. విరామ సమయంలో కూల్‌డ్రింక్స్ కొనుగోలు చేద్దామని క్యాంటిన్‌కు వెళ్ళాను బోర్డ్‌పై అక్కడ ఒక్కో కూల్‌డ్రింక్ ధర రూ.30 అని ఉంది. రెండు కొనడానికి కౌంటర్‌లో ఉన్న బాయ్‌కి రూ.60 ఇచ్చాను. అతను ఇంకా రూ.20 చెల్లించాలని అడిగాడు. అప్పుడు నేను స్పందిస్తూ బోర్డ్‌పై ఉన్నరేటునే చెల్లిస్తానని కచ్చితంగా చెప్పాను. మీఇష్టం ఉంటే తీసుకోండి లేకపోతే లేదు అంటూ దురా భ్షలాడాడని రమా శంకర్ వాపోయాడు. చేసేదేమిలేక అతను అడిగినంత ఇచ్చి కొనుగోలు చేసినట్లు తెలిపాడు.

**వస్త్ర వ్యాపారంలోనూ...**

వస్త్రాలపై జీఎస్టీ ఉండటంతో ఇతర ప్రాంతాల నుండి బిల్లులు లేకుండా సరుకు దిగుమతి చేసుకొని ఎమ్మార్పీపై అధనంగా భారం మోపుతున్నారు. జీఎస్టీ తమ వ్యాపార ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపడంతో జీరో వ్యాపారం పైనే మొగ్గుచూపుతున్నారు. జీఎస్టీతో ధర పెరిగిందని బిల్లులు కావాలంటే మరి కొంత చెల్లించాల్సి ఉంటుదనే కారణంతో వినియోగదారులకు ఎలాంటి బిల్లు చెల్లించకుండానే క్రయ విక్రయాలు చేస్తున్నారు. జీఎస్టీ పేరుతో వచ్చే సొమ్ము నేరుగా వ్యాపారి జేబుల్లోకి వెళుతుండగా ఇటు ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుండటంతో పాటు సామాన్యుడిపై ధర భారం అధికమవుతోంది.

# రైలు ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే సూచనలు

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరే రైలు ప్రయాణికులకు రైల్వేశాఖ పలు చూచనలు చేసింది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రూ. 720 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. ప్రతిష్టాత్మకమైన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అప్‌గ్రేడేషన్ ప్రాజెక్టును చేపట్టింది. నిర్మాణ పనుల్లో భాగంగా ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన విధానాలను సూచించింది. అలాగే ప్రయాణికులకు పలు విషయాలను తెలియజేయాలనుకుంది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఉత్తరం వైపున ఉన్న స్టేషన్ భవనాన్ని కూల్చివేసి కొత్త భవనం నిర్మిస్తోంది. రైలు ప్రయాణీకులకు భద్రతను కల్పిస్తూ ఎలాంటి అసౌకర్యం లేకుండా ఉండేందుకు పలు కీలకమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ విషయంలో, రైలు ప్రయాణీకులు స్టేషన్‌లోకి ప్రవేశించే, నిష్క్రమించే ద్వారలలో రాకపోకలను సమర్థవంతంగా నిర్వహించడానికి, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రద్దీని క్రమబద్ధీకరించడానికి అధికారులు కొన్ని చర్యలు చేపట్టారు. ప్లాట్‌ఫామ్ నెం.1కి వెళ్లడానికి గేట్ నెం.2 (గణేష్ ఆలయం పక్కన) వద్ద కొత్త ప్రవేశ ద్వారం తెరిచారు. దానితో పాటు జనరల్ బుకింగ్ కౌంటర్ సౌకర్యం, విచారణ మరియు 750 మంది ప్రయాణీకులు నిలిచి వుండే సామర్థంతో కల్గిన 500 అదనపు సీటింగ్ సామర్థంతో నూతన వెయిటింగ్ హాల్‌ను ఏర్పాటు చేశారు. గేట్ నంబర్ 4 మూసివేశారు, గేట్ నంబర్ 3, గేట్ నంబర్ 3బీ (స్వాతి హోటల్ ఎదురుగా) వద్ద అదనపు ప్రవేశం కల్పించారు. ప్లాట్‌ఫామ్ నంబర్ 10 లోని గేట్ నంబర్ 8 (భోయిగూడ వైపు ప్రవేశ ద్వారం) వద్ద జనరల్ బుకింగ్ సౌకర్యంతో పాటు కొత్త ప్రవేశం ద్వారం తెరిచారు. స్టేషన్‌లోకి ప్రవేశించే ఎంట్రీ/ఎగ్జిట్‌ల (బయటకు వెళ్ళే) మార్గం వద్ద ప్రయాణికులు తరచు తిరిగే ప్రాంతాలలో ప్లాట్‌ఫారమ్‌లలో, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలపై సులభంగా గుర్తించడానికి, ప్రయాణీకుల కదలిక సజావుగా సాగడానికి తగిన సైన్ బోర్డులు, దిశానిర్దేశ బోర్డులను ఏర్పాటు చేశారు. స్టేషన్‌లో కమర్షియల్ ఇన్‌స్పెక్టర్లను నియమించారు మరియు ఏదేని పరికరాల మరమ్మత్తు ఏర్పడితే వాటిని గుర్తించి సత్వరమే సరిచేయడానికి మరియు ఏదైనా అవాంఛనీయ సంఘటనలు తలెత్తితే సత్వర చర్యలు తీసుకోవడానికి పర్యవేక్షణ జరుగుతోంది. కుంభమేళా సందర్భంగా ప్రత్యేక రైళ్ల పర్యవేక్షణతో పాటు, రద్దీ సమయాల్లో రద్దీని పర్యవేక్షించడానికి కమర్షియల్ అధికారులను నియమించారు. ఏ సమయంలోనైనా, రద్దీనీ నియంత్రించడం కోసం స్టేషన్‌లో తగినంత టికెట్ తనిఖీ సిబ్బంది అందుబాటులో ఉంటారు. ప్రయాణీకుల సురక్షితమైన, సజావుగా రైలు ఎక్కేందు కోసం తగిన జాగ్రతలు తీసుకున్నారు. 24 గంటలపాటు పరిమిత సంఖ్యలో స్టాళ్లు పనిచేస్తూనే ఉంటాయి. ప్లాట్‌ఫారమ్ 01 10 వద్ద అందుబాటులో వున్న ట్రైన్‌లో ప్రయాణించే ప్రయాణికుల కోసం చివరి నిమిషంలో పరుగెత్తకుండా, ఆయా ప్లాట్‌ఫారమ్‌లకు సులువుగా వెళ్లిపోవడానికి వీలుగా ప్లాట్‌ఫారమ్‌లను ముందుగానే ఎంపిక చేస్తున్నారు. ప్లాట్‌ఫారమ్‌లకు ,ఆలస్యంగా వచ్చిన వారు, దివ్యాంగజన్ కోచ్ స్థానం లాంటి మొదలైన వాటి గురించి తరచుగా ప్రకటనలు చేస్తున్నారు. ప్రయాణికుల రద్దీని సమర్థవంతంగా నిర్వహించడానికి ఎంట్రీ/ఎగ్జిట్ గేట్లు, ప్లాట్‌ఫారమ్‌లు, కాన్‌కోర్స్‌లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిల వద్ద అదనపు ఆర్‌పిఎఫ్ (రైల్వే భద్రత దళ సిబ్బందిని) మోహరించిఉంటారు. భద్రతా సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించడానికి ఆర్‌పిఎఫ్ సిబ్బంది మెరుగైన సీసీటీవి నిఘా నెట్‌వర్క్ ద్వారా రియల్‌టైమ్ పర్యవేక్షణ చేస్తారు. మహిళా ప్రయాణీకులకు సురక్షితమైన పరిస్థితినీ కల్పించడం కోసం మహిళల భద్రత కోసం ఆర్‌పిఎఫ్ శక్తి బృందాల మోహరింపు సిద్ధంగా ఉంటుంది. అలాగే స్టేషన్‌లో అగ్నిమాపక భద్రతా తనిఖీలు చేపట్టడంతో పాటు భద్రతా ప్రోటోకాల్‌లను అనుసరిస్తున్నారు. స్టేషన్ పునరాభివృద్ధి పనులలో భాగంగా పెద్ద ఎత్తున నిర్మాణ పనులు జరుగుతున్నందున రైలు వినియోగదారులు సహకారాన్ని అందించాలని రైల్వే శాఖ విజ్ఞప్తి చేస్తోంది. సికింద్రాబాద్ స్టేషన్ నుండి ప్రయాణించే ప్రయాణీకుల భద్రత, రక్షణ పూర్తి స్థాయిలో సౌకర్యాలను కల్పించేందుకు గాను దక్షిణ మధ్య రైల్వే జోన్ కట్టుబడి ఉంది. ప్రయాణీకులు.. సైన్ బోర్డులను అనుసరించాలని, అధికారులతో సహకరించాలని, ఏదైనా సహాయం కోసం తక్షణ సహాయం కోసం ఆర్‌పీఎఫ్ హెల్ప్‌లైన్ 139ని సంప్రదించవచ్చని దక్షిణ మధ్య రైల్వేముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఎ.శ్రీధర్ సూచించారు.సూచించారు.



దక్షిణ మధ్య రైల్వేముఖ్య ప్రజాసంబంధాల అధికారి ఎ.శ్రీధర్ (ఫైల్)

## 22 నుండి మార్చి29 వరకు "ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం"

**-ప్రతిశనివారం సర్కిల్ కార్యాలయంలో నిర్వాహణ**
**-జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి వెల్లడి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 19,ప్రభాతవార్త:** ఆస్తిపన్ను సమస్యల పరిష్కారం కోసం "ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం" కార్యక్రమాన్ని ఫిబ్రవరి 22నుంచి మార్చి 29వరకు ప్రతి శనివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటలవరకు సర్కిల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు ఆస్తిపన్ను సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా "ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం" ను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పన్ను సమస్యలు, పునఃసమీక్షా అభ్యర్థనలు, ఆస్తిపన్ను అంచనాల్లో సవరణలు, బిల్ కలెక్టర్ల ద్వారా / ఆర్‌టిజిఎస్ ద్వారా చెల్లింపుల నమోదు, ఆన్‌లైన్ బకాయిలు సరిచేయడం, కోర్టు కేసుల పరిష్కారం,ఐజిఆర్ఎస్ సమస్యలు స్వయంమూల్యాంకనం, సంబంధిత విషయాలు,ఇతర పన్ను సంబంధిత సమస్యలు తదితర అంశాలను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆస్తిపన్ను కు సంబంధించిన ఏవైనా సమస్యలున్న వారు తమ సంబంధిత డిప్యూటీ కమి షనర్ కార్యాలయంలో పై పేర్కొన్న తేదీలలో నిర్వహించు ప్రాపర్టీ టాక్స్ పరిష్కారం కార్యక్రమంలోసంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

## బతుకమ్మకుంటలో వి.హెచ్ ప్రత్యేక పూజలు

**-చెరువు పునరుద్ధరణపై హర్షం**
**-బతుకమ్మ ఆడిపాడిన కాంగ్రెస్ శ్రేణులు**



పూజలు చస్తున్న మాజీ ఎంపి.వి.హనుమంతరావు, రోహిన్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 19,ప్రభాతవార్త:** హైడ్రా ఆధ్వర్యంలో చేపట్టిన బతుకమ్మ కుంట పునరుద్ధరణ పనులు త్వరగా పూర్తి చేసి, రాబోయే బతుకమ్మ పండుగకు మహిళా సోదరీమణులు తమ బతుకమ్మలను బతుకమ్మ కుంటలో నిమజ్జనం చేస్తారని మాజీ ఎంపి వి.హనుమంతరావు అన్నారు. ఈమేరకు బుధవారం బతుకమ్మ కుంటలో ఖైరతాబాద్ డి.సి.సి అధ్యక్షుడు అంబర్పేట్ నియోజకవర్గం ఇంచార్జ్ రోహిన్ రెడ్డితో కలిసి ప్రత్యేక పూజ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వి. హనుమంతరావు గారు మాట్లాడుతూ, కబ్జా కి గురి అయిన బతుకమ్మ కుంట చెరువు పునరుద్ధరణ జరగడం, ఎంతో ఆనందదాయకమన్నారు. ఇన్నేళ్ల పోరాటానికి ఈరోజు సరియైన ఫలితం దక్కిందని ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డికి హైడ్రా కమిషనర్ రంగనాథన్‌కు ధన్యవాదాలు తెలిపారు. రోహిన్ రెడ్డి గారు మాట్లాడుతూ గత కొద్ది కాలంగా కబ్జాకి గురి అయిన, ఈ బతుకమ్మ కుంట విషయాన్ని వి. హనుమంతరావు సిఎం రేవంత్ రెడ్డి గారి దృష్టికి తీసుకురావడం జరిగింది. సీఎం వెంటనే స్పందించి, పరిష్కారాన్ని చేకూర్చారన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్ యాదవ్, లకపతి యాదగిరిగౌడ్ ,జ్యోతి గౌడ్,సత్తిబాబు , శ్రీకాంత్ గౌడ్ ,ఉషశ్రీ, రామ్ మోహన్, మోత రోహిత్,సత్తిబాబు గారు గడ్డం శ్రీధర్ గౌడ్, కోటం అనిల్, రావుల సుధాకర్, కృష్ణ గౌడ్, వెంకటేష్ , శ్రీనివాస్ రెడ్డి, జమీర్, శశి, కిషోర్,కోట్ల కిరణ్, రాజకిరణ్, నిజాం సునీల్ గౌడ్, మహిళా నాయకులు సునీతరెడ్డి, లావణ్య, విజిత రెడ్డి, శాంతమ్మ, బతుకమ్మ కుంట నివాసులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన జిల్లా కలెక్టర్



శ్రీరామ్‌నగర్ హాస్పిటల్‌లో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిషెట్టి.

**యూసుఫ్‌గూడ ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** రహమత్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిషెట్టి పర్యటించారు. ఆస్పత్రిలో పలు రకాల సమస్యలతో స్థానికంగా రోగులు ఇబ్బందులు పడుతున్నట్లు అదేవిధంగా పలు సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా కలెక్టర్ స్వయంగా పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా స్థానిక కార్పొరేటర్ సీఎన్ రెడ్డి స్వయంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో ఉన్న అంబులెన్స్ పనిచేయకపోవడంతో 3 నెలల నుంచి అంబులెన్స్ సేవలు నిలిచిపోయాయి. అదేవిధంగా గత 9 నెలలుగా సిబ్బందికి జీతాలు అందటం లేదని వారు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అందుకు ఆయన వెంటనే స్పందించి తగిన విధంగా సౌకర్యాలు కల్పించేందుక చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం డివిజన్ పరిధిలోని ఎస్పీఆర్ హిల్స్ దాదాపు 9 ఎకరాల గ్రౌండ్‌ను దాని పక్కనున్న క్వారి స్థలాలను పరిశీలించి అవి అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ సిబ్బంది నిరంతరం దృష్టి సారించాలన్నారు. నూతనంగా నిర్మిస్తున్న వాటర్ రిజర్వాయర్‌ను దాదాపు రెండేళ్ల క్రితం నిర్మాణం పూర్తయ్యి ప్రారంభానికి నోచుకోని దళిత స్టడీ సెంటర్లను కూడా ఆయన పరిశీలించారు. డివిజన్ పరిధిలోని బస్తీల కాలనీలలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కార్పొరేటర్ సీఎన్ రెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.

## సబ్దార్‌నగర్ ప్రధాన రహదారిలో అక్రమ నిర్మాణాలు కూల్చివేత



సబ్దార్‌నగర్‌లో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న రెవెన్యూ, ఇరిగేష్ అధికారులు.

**యూసుఫ్‌గూడ ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సబ్దార్‌నగర్ ప్రధాన రహదారిలోలో అనుమతులు లేకుండా నిర్మించిన గదులను ఇరిగేషన్, రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు కూల్చివేశారు. నాలాలు, చెరువుల సమీపంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా వాటిని తొలగించాలని ప్రజా ప్రభుత్వం స్పష్టంగా ఆదేశాలను జారీ చేసింది అయినప్పటికి సబ్దార్‌నగర్ ప్రధాన రహదారిలో నిర్మాణాలు చేపట్టారు. గతంలో కూడా రెండుసార్లు నిర్మాణాలు చేపట్టడంతో కూల్చివేయటం జరిగింది. కాముని చెరువు సమీపంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికుల ఫిర్యాదు మేరకు జేసీబీ సాయంతో బుధవారం కూల్చివేశారు.

**వికాస్‌పురి కాలనీలో...**

ఎర్రగడ్డ డివిజన్ పరిధిలో వికాస్‌పురి కాలనీ ఆక్స్ ఫర్డ్ స్కూల్ రోడ్డులో అప్సర్ అనే వ్యక్తి ప్లాట్ 15 జీప్లస్2 పర్మిషన్ తీసుకుని 3,4,6 అనుమతులు లేకుండా భవనాన్ని నిర్మించటంతో యూసుఫ్‌గూడ సర్కిల్ ఉప కమిషనర్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారి నరేష్ ఆధ్వర్యంలో కూల్చివేతలు చేపట్టారు. అనుమతులు విషయంలో ఇంటి యజమాని తీసుకున్న దానికంటే అదనంగా అంతస్తులు నిర్మించటంతో 3 నోటీసులు జారీ చేసి వారు స్పందించక పోవడంతో అధికారులు బుధవారం కూల్చివేతలు చేపట్టారు.

## నగర కేంద్ర గ్రంథాలయ వద్ద గ్రూప్స్ విద్యార్థుల ఆందోళన



ఆందోళన నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రూప్ నోటిఫికేషన్‌లో రోస్టర్ విధానంలో తప్పులు సరిదిద్దాకే మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని ఆ రాష్ట్ర పోటీ పరీక్షల అభ్యర్థులు డిమాండ్ చేశారు. రోస్టర్ విధానంలో తప్పులు సరిదిద్దాకే మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని ఏపీ రాష్ట్ర గ్రూప్స్ అభ్యర్థులు నగర కేంద్ర గ్రంథాలయం వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీ రాష్ట్ర పోటీ పరీక్షలు అభ్యర్థులు సురేష్, అంజన్, సిహెచ్ శాంతి లత, విజయదుర్గ, షేక్ హసీనా లు మాట్లాడుతూ ఏపీ రాష్ట్రంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడిచిన సరే రోస్టర్ విధానంలో తప్పులు ఉన్నాయని తెలిసినా ఇంతకాలం ఏపీపీఎస్సీ సి సరిదిద్దకుండా గ్రూప్2 మెయిన్స్ పరీక్షలు ఈనెల 23వ తేదీన నిర్వహించడానికి సిద్ధం కావడం సరికాదన్నారు.. ఏపీ రాష్ట్రంలో గ్రూప్స్ మెయిన్స్ పరీక్ష కొరకు సుమారు 92,250 మంది అభ్యర్థులు 23వ తేదీన పరీక్ష రాయడానికి సందిగ్ధంలో స్థితిలో ఉన్నారని తెలిపారు. గత రెండు వారాలు నుండి మానసిక మీదతో గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎందుకంటే గత ప్రభుత్వం ఐదు సంవత్సరాలలో ఇచ్చిన ఒకే ఒక గ్రూప్ నోటిఫికేషన్ ఇదని. ఈ నోటిఫికేషన్ లో కూడా రోస్టర్ విధానంలో చాలా తప్పులు ఉన్నాయని తెలిపారు. రోస్టర్ విధానాన్ని సరిచేసి నిరుద్యోగులకు అన్యాయం జరగకుండా గ్రూప్2 మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు.

## కరెంట్ షాక్‌తో యువకుడు మృతి..

**పేట్ బషీరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**

కరెంట్ షాక్‌తో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వుడ్ కాలనీలోని ఒక కన్స్‌ట్రక్షన్ సైట్‌లో 5 అంతస్తుల భవనంలో ఆయాన్ ఖాన్ (22) 4వ అంతస్తులో ప్లంబింగ్ పని చేయడానికి డ్రిల్లింగ్ మెషిన్‌వైర్‌ను గ్రౌండ్ ఫ్లోర్ నుంచి 4వ ఫ్లోర్‌కు వైర్ కనెక్షన్ ఇచ్చి పనిచేస్తున్నాడు. ప్రమాదవశాత్తు డ్రిల్లింగ్ మెషిన్ వైర్ షాక్ కొట్టి చనిపోయాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అలుగు యథావిధిగా పునరుద్ధరణ : డిఇ ఉదయ్‌భాస్కర్



వివరాలు తెలుసుకుంటున్న డిఇ ఉదయ్‌భాస్కర్

**దుండిగల్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** దుండిగల్ పురపాలిక సంఘం పరిధి దుండిగల్‌లోని చిన్నదామెర చెరువు అలుగు తొలగించడంతో పాటు చెరువులో మురుగు నీరు చేరుతుందని ముదిరాజ్ సంఘం నుండి అందిన ఫిర్యాదు మేరకు బుధవారం నీటిపారుదల శాఖ డిఇ ఉదయ్‌భాస్కర్ చెరువును సందర్శించారు. అలుగు, మరుగు నీరు మళ్ళింపులను పరిశీలించారు. ఈసందర్భంగా డిఇ మాట్లాడుతూ చెరువు అలుగును గతంలో మాదిరిగా యాథావిధిగా పునరుద్ధరించాలని ముదిరాజ్ సంఘం సభ్యులకు సూచించారు. అదే విధంగా తగిన ప్రతిపాదనలు పంపి చెరువులోకి మురుగు నీరు చేరకుండా చర్యలు చేపడుతామని హామినిచ్చారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షులు కావలి గణేష్,మాజీ కౌన్సిలర్ అమరం గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి బండారి మహేష్,మాజీ వార్డు సభ్యులు పిట్ల సత్యనారాయణముదిరాజ్, ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసిన నవీన్‌కుమార్ మాదిగ



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కల్సిన ముప్పిడి నవీన్‌కుమార్ మాదిగ

**బేగంపేట ఫిభ్రవరి 19,ప్రభాతవార్త**

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను దళిత చైతన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పిడి నవీన్‌కుమార్ మాదిగ బుధవారం మర్యాద పూర్వకంగా కలిసారు.సికింద్రాబాద్ లోని ఇఫ్లూ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమానికి విచ్చేసిన గవర్నర్ ను నవీన్‌కుమార్ కలిసారు.గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.ప్రజా సమస్యలపై దళిత చైతన్య సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని,ఈ సందర్భంగా గవర్నర్‌కు నవీన్ కుమార్ వివరించారు.

## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా



ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్న దృశ్యం.

**బేగంపేట ఫిభ్రవరి 19,ప్రభాతవార్త**

బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల లో బుధవారం టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో అనుదీప్ ఫౌండేషన్ మరియూ మాజిక్ బస్ ఫౌండేషన్ సౌజన్యంతో 15కంపెనీలతో డ్రైవ్ నిర్వహించారు.ఈ జాబ్ మేళాలో 347మంది విధ్యార్థినులు రిజిస్టర్ చేసుకున్నారు.వీరందరికీ వివిధ అంశాలలో పరిక్షలు నిర్వహించారు. ఉద్యోగాలకు ఎంపికైన వారి వివరాలను త్వరలోనే తెలియజేస్తామని కంపెనీల ప్రతినిధులు తెలిపారు.డిగ్రీ స్థాయిలో విద్యను అభ్యసిస్తున్న పేద మరియూ మధ్య తరగతి యువతులకు ఈ జాబ్ డ్రైవ్ ఒక చక్కని అవకాశం అని కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ త్రిపురం భాస్కరరెడ్డి తెలిపారు.ఈ మెగా జాబ్ మేళాలో టీఎస్‌కేసీ కో ఆర్డినేటర్ డాక్టర్ డి.శారదాదేవి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఆనీ షెరాన్,టీఎస్‌కేసీ మెంటార్ అబ్దుల్ వాజిద్ కళాశాల సిబ్బంది,విధ్యార్థినులు పాల్గొన్నారు.

## ఆస్థిపన్నును తగ్గించాలని ఎమ్మెల్యేకు వినతి



ఆస్థిపన్నులను తగ్గించాలని కోరుతూ రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నేత హరీష్‌గౌడ్.

**నార్సింగి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో ఆస్థిపన్నును పేద ప్రజలు మోయలేనంత భారీగా పెంచారని, దాన్ని తగ్గించి పేదలకు ఊరట కలిగించాలని కోరుతూ రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు కాంగ్రెస్ నేత హరీష్‌గౌడ్ వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా హరీష్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని గ్రేటర్ హైదరాబాద్‌లో కూడా లేనంత భారీగా బండ్లగూడ కార్పోరేషన్‌లో అధికారులు ప్రజలపై ఆస్థి పన్నులు విధిస్తున్నారన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు ఏటేటా ఇష్టానుసారంగా పెంచుతున్న ఆస్థి పన్నులను కట్టలేక అవస్థలు పడుతున్నారన్నారు. అనేకమార్లు ఆస్థి పన్నులు తగ్గించాలని కోరుతూ పాలకవర్గ సభ్యులకు, అధికారులకు విన్నవించినా ఎవరూ స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను అందించిన వినతిపత్రంను చదివిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ఆస్థి పన్నులను తగ్గించాలని ఆదేశించారని హరీష్‌గౌడ్ పేర్కొన్నారు. ప్రజల సమస్యల పట్ల వేగంగా స్పందించే గుణం ఉండడం వల్లనే వరుసగా నాలుగు సార్లు ప్రకాశ్‌గౌడ్‌ను ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపించుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యే స్పందన పట్ల హరీష్‌గౌడ్ సంతోషంను వ్యక్తం చేశారు.

## సాయన్నకు నివాళులర్పించిన మహేశ్వర్ రెడ్డి



మాజీ ఎమ్మెల్యే సాయన్నకు నివాళులర్పిస్తున్న కంటోన్మెంట్ బోర్డు మాజీ మెంబర్ తదితరులు

**కంటోన్మెంట్,ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:**

కంటోన్మెంట్ మాజీ ఎమ్మెల్యే జి.సాయన్న వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం 7వ వార్డు లాల్‌బజార్ చౌరస్తాలో ఏర్పాటు చేసి వర్ధంతి వేడుకలకు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి పాల్గొని నియోజకవర్గానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ బోర్డు సభ్యులు ప్యారసాని శ్యామ్‌కుమార్, లోకనాథం, నళిని కిరణ్, అనితా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఛత్రపతి శివాజికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు



చత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి అంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



శివాజీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



బేగంపేటలో ఛత్రపతి శివాజీ మహారాజ్ ర్యాలీలో పాల్గొన్న బీజేపీ శ్రేణులు



ఖానాపూర్ గ్రామంలో శివాజి జయంతి ఉత్సవాలను జరుపుకుంటున్న యువకులు, పుర ప్రముఖుల దృశ్యం.



ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అడిక్‌మెట్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్



అడ్డగుట్టలో ఛత్రపతి శివాజీకి నివాళులర్పిస్తున్న బిజెపి అధ్యక్షుడు భరత్ గౌడ్ తదితరులు



బోయిన్‌పల్లి ప్లే గ్రౌండ్ వద్ద ఛత్రపతి శివాజీకి నివాళులర్పిస్తున్న జంపన ప్రతాప్ తదితరులు



సత్యనారాయణరెడ్డి భవన్ వద్ద శివాజీ కటౌట్‌కు నివాళులు అర్పిస్తున్న సిపిఐ నేతలు



వివేకానంద్‌నగర్ కాలనీలోని రోడ్డు నెంబర్ 9లో ఛత్రపతి శివాజి మహారాజ్ జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు.



హైదర్షాకోట్ బొడ్రాయి వద్ద శివాజీ జయంతి వేడుకలను జరుపుకుంటున్న నర్సింగ్‌రావ్, రాజిరెడ్డి, ప్రమోద్ తదితరుల దృశ్యం.



ఛత్రపతి శివాజీమహారాజ్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న తెలంగాణ భజరంగ్‌సేనా

# ఛత్రపతి శివాజీ మహారాజ్‌కి ఘన నివాళి

## భవన నిర్మాణాలకు ఇసుక ఉచితంగా ఇవ్వాలి

-తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్



కార్మిక వెల్ఫేర్ బోర్డు కార్యదర్శి డాక్టర్ గంగాధర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్(సిఐటియు) ప్రతినిధులు

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** భవన నిర్మాణాలకు ఇసుక ఉచితంగా ఇవ్వాలని, వెల్ఫేర్ బోర్డులో గత ఆరు నెలలుగా ఆన్లైన్ సక్రమంగా పనిచేయని కారణంగా పెండింగ్ క్లెయిమ్స్ రెన్యువల్స్ నమోదు వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని, రాష్ట్ర వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని కార్మిక సంఘాల నాయకులతో నియమించాలని కోరుతూ కార్మిక శాఖ అదనపు కమిషనర్, వెల్ఫేర్ బోర్డు కార్యదర్శి డాక్టర్ ఇ.గంగాధర్‌ను తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్(సిఐటియు) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వంగూరు రాములు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రామ్మోహన్‌రావు, ఆర్.కోటంరాజు, ఉపాధ్యక్షుడు కె.జంగయ్యలతో కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించింది. అన్నిరకాల నిర్మాణాలకు ఇసుక ఫ్రీగా ఇవ్వాలని, వెల్ఫేర్ బోర్డులో అన్లైన్ అప్డేట్ పేరుతో ఆరు నెలలుగా కార్మికుల పేర్లు నమోదు. రెన్యువల్, క్లైమ్స్ క్లియర్ వంటి సేవలు స్థంభించాయి. ఆన్లైన్ సేవలను వెంటనే పునరుద్ధరించాలని, వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని కార్మిక సంఘాల ప్రతినిధులతో నియమించాలని, బోర్డు నిధులు దుబారా కాకుండా కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలని, కోటి రూపాయల పైన వ్యయంతో నిర్మించే నిర్మాణాలపై 2 శాతం సెస్సు వసూలు చేయాలని, గత ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించిన లక్ష మోటార్ సైకిల్సు కార్మికులకు అందించుటకు నిబంధనలు రూపొందించాలని, ప్రమాద మరణానికి రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.5 లక్షలు. దహన సంస్కారాల ఖర్చు, ప్రసూతి, వివాహ కానుకలను రూ. లక్షకు పెంచాలని, ఖాళీగా ఉన్న ఏఎల్, ఏసీఎల్, డిసిఎల్, జూనియర్, సీనియర్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని, కేంద్ర చట్టంలో ఉన్న పెన్షన్, పిల్లలకు స్కాలర్షిప్లు, గృహవసతి, అడ్డాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని, 2009లో నమోదు చేసుకున్న కార్మికుల కార్డులు యుద్ధ ప్రాతిపదికన రెన్యువల్ చేయాలని, ఈశ్రమ్ గుర్తింపు కార్డులను భవన నిర్మాణ కార్మికులందరికీ అందజేయాలని, ప్రమాదాలకు గురైన కార్మికులకు ఆర్థిక సహాయం అందించాలని, ప్రాజెక్టులు, రోడ్లు, పెద్ద పెద్ద కంపెనీలు, ఇటుక బట్టీల్లో పనిచేసే కార్మికులు, వలస కార్మికులు అందరినీ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి బోర్డులో నమోదు చేసి సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:**

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమబోర్డును ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. బుధవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ టేబుల్ సమావేశం ఉద్యమకారుల జేఏసీ సెక్రటరీ జనరల్ ప్రఫుల్ రాంరెడ్డి అధ్యక్షతన జరిగింది. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇవ్వాలని, ఉద్యమకారులకు నెలకు రూ.30వేల గౌరవ వేతనాన్ని ప్రతినెలా ఇవ్వాలని తీర్మాణించింది. జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, జేఏసీ గౌరవ అధ్యక్షుడు రంగారెడ్డి లు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఉద్యమకారులను గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యమంలో పనిచేసి లబ్ధిపొందని కళాకారులను సాంస్కృతి సారధిలోని వివిధ పోస్టులలో అవకాశం ఇవ్వాలని, ఉచిత బస్సు పాసులు, 250 గజాలు ఇంటి స్థలతో పాటు నాలుగు గదుల ఇల్లు నిర్మించి అందజేయాలని, ప్రభుత్వ పథకాలలో ఉద్యమకారులను మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, ఇతర రాష్ట్రాల్లో ఉద్యమకారులకు ఆర్థిక సహకారాలు అందిస్తున్నట్లుగా తెలంగాణ ఉద్యమకారులకు నెలకు రూ.30వేల గౌరవ వేతనాన్ని ప్రతినెలా ఇవ్వాలని, అమరవీరుల స్మృతి వనము 100 ఎకరాలలో ఏర్పాటు చేయడంతో పాటు ఉద్యమకారులకు ఆరోగ్య భీమా రూ.20 లక్షల వరకు ఏర్పాటు చేసి ఉద్యమంలో అమరులైన కుటుంబాలకు సంక్షేమ నిధిని అందించి తెలంగాణ ప్రతి జిల్లాలోని అమరులైన ఉద్యమకారులకు స్మారక భవనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర నాయకులు సోమన్న, యాదగిరి, చంద్రన్న, ప్రసాద్, మాధవి, యాదగిరి, ఏ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంలో పాల్గొన్న జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, జేఏసీ గౌరవ అధ్యక్షుడు రంగారెడ్డి, సెక్రటరీ జనరల్ ప్రఫుల్ రాంరెడ

## మహిళా బిల్లులో బిసి మహిళలకు సబ్ కోటా కల్పించాలి

-మార్చి 18,19 తేదీల్లో ఛలో ఢిల్లీ : ఆర్. కృష్ణయ్య



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య, జయంతిగౌడ్, గుజ్జకృష్ణ, సత్యం, తదితరులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 19,ప్రభాతవార్త:**

మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్య సభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతీయ ఓబీసీ మహిళా సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షురాలు మట్ట జయంతి గౌడ్ అధ్యక్షతన బుధవారం కాచిగూడలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. చట్టసభలలో మహిళలకు కేటాయించిన 33 శాతం రిజర్వేషన్లలో బీసీ మహిళల కు 50శాతం సబ్ కోటా కల్పించాలని డిమాండ్ చేస్తూ మార్చి 18,19 తేదీల్లో చేపట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో జరిగే జాతీయ బీసీ మహిళా సదస్సులో మహిళా ప్రజాప్రతినిధు లు, వివిధ రాజకీయ పార్టీలనేతలు, పార్లమెంట్ సభ్యులు పాల్గొంటారని తెలిపారు. సదస్సు ద్వారా బీసీ మహిళలకు సబా కోటా కల్పించే విషయమై తీర్మానాలు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురా నున్నట్లు తెలిపారు. బీసీ మహిళల సబ్ కోటకు రాజ్యాంగ బద్ధంగా రక్షణ కల్పించాలన్నారు. కాలయాపన చేయకుండా వచ్చే పార్లమెంట్ సమావేశాలలో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించే బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు. దేశ వ్యాప్త జనగణనలో కుల గణన చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, తంగెళ్లముడి నందగోపాల్, జ్ఞానేశ్వర్, సుధాకర్, ఉదయ్, జక్కుల వంశీ కృష్ణ, సునిత, శ్రీనివాస్, సిహెచ్. అనురాధ, ప్రనీత, స్వరూప, భాగ్యలక్ష్మీ, జ్యోతి, ప్రమోద, బాలరాజ్, హరితిలక్ సింగ్, రాజు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వాసవి అమ్మవారి ఆలయ అభివృద్ధికి అన్నివిధాలా తోడ్పాటు : ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్



శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయం జగద్గిరిగుట్ట కమిటీ చైర్మెన్ రేగోడు ప్రవీణ్‌గుప్తా, ఉప్పల రమేశ్‌గుప్తా, నేతి శంకర్‌గుప్తా ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త**

జగద్గిరిగుట్ట శ్రీవాసవి దేవస్థాన కమిటీ చైర్మెన్ రేగోడు ప్రవీణ్‌గుప్తా, ఉప్పల రమేశ్‌గుప్తా, నేతి శంకర్‌గుప్తా ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయ అభివృద్ధికి పూర్తి సహయ, సహకారాలను oదిస్తానని కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ హామీ ఇచ్చారు. బుధవారం జగద్గిరిగుట్ట శ్రీవాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయ కమిటీ ప్రతినిధులు కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్‌ను కలిసి హైడ్రా అధికారుల నుండి వచ్చిన నోటీసును చూపించి తగిన సహయ, సహకారాలు అందించాలని విజ్ఞప్తిచేశారు. ఈ సందర్భంగా ఆయన జగద్గిరిగుట్ట శ్రీవాసవి దేవస్థాన కమిటీ చైర్మెన్ రేగోడు ప్రవీణ్‌గుప్తా, అధ్యక్షులు ఉప్పల రమేశ్‌గుప్తా, ప్రధానకార్యదర్శి చిగుళ్లపల్లి లక్ష్మణ్‌రావు, వైస్ చైర్మెన్ నేతి శంకర్‌గుప్తా, లతోపాటు కమిటీ ప్రతినిధులతో మాట్లాడారు. జగద్గిరిగుట్టలో వెలసిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయ అభివృద్ధికి తను శాయశక్తులా తోడ్పడతానని హామీఇచ్చారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఆలయ అభివృద్ధికి పూర్తి చర్యలు తీసుకుని ఆలయపేరు విస్తరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా జగద్గిరిగుట్ట శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయ కమిటీ చైర్మెన్ రేగోడు ప్రవీణ్‌గుప్తా, అధ్యక్షులు ఉప్పల రమేశ్‌గుప్తా, ప్రధానకార్యదర్శి చిగుళ్లపల్లి లక్ష్మణ్‌రావు, వైస్‌చైర్మెన్ నేతి శంకర్‌గుప్తా, ఉపాధ్యక్షులు లక్ష్మి నర్సయ్యగుప్తా తదితరులు పాల్గొన్నారు

## పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి : టిఎన్‌జిఓ



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిన్ని కలిసి సెంట్రల్ టిఎన్‌జిఓ ప్రతినిధుల బృందం

**గోషామహల్,ఫిబ్రవరి 19ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగులు పెండింగ్ బిల్లులు రాకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,పిఆర్‌సి పెండింగ్,డిఏలు, సిపిఎస్ రద్దు,కొత్త జిల్లాలో అదనపు క్యాడర్స్, ఉద్యోగుల హెల్త్ కార్డ్స్ తదితర అంశాలపై పట్ల ప్రభుత్వం వెంటనే ఆలోచన చేసి పరిష్కరించాలని తెలంగాణ నాన్ గజిటెడ్‌సెంట్రల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జగదీశ్వర్,ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్ హుస్సేనీ విజ్ఞప్తి చేశారు.ఈమేరకు అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు,ముత్యాల సత్యనారాయణ గౌడ్,రంగారెడ్డి జిల్లాఅధ్యక్షులు లక్ష్మన్‌తో కలిసి వెళ్లి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విన్నవించారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా ఉద్యోగుల పెండింగ్ సమస్యలపై చర్చ జరిగినట్లు చెప్పారు. టిఎన్‌టిఓ సంఘం ఉద్యోగుల ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై వినతిపత్రం అందచేయడం జరిగిందన్నారు.అందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిస్పందించి పెండింగ్‌లో ఉన్న సమస్యలను,న్యాయపరమైన సమస్యలను పరిష్కరించేందుకుగాను కృషి చేస్తామనిహామి ఇచ్చినట్లు చెప్పారు.ఉద్యోగులు ఎవరు కూడా ఆందోళన చెదవద్దన్నారు.ఇప్పుడున్న పరిమితిని పెంచి రాబోయే రెండు,మూడునెలలో పెండింగ్ బిల్లులు లేకుండ చేస్తామన్నారు.పెండింగ్‌లో ఉన్న డి.ఏ.లు,వేతన సవరణగాని,ఆరోగ్య పథకం,కంట్రిబ్యూటర్ పెన్షన్ విధానాన్ని రద్దుగాని, గచ్చిబౌలి ఇండ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ఇతర సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ట్రాన్స్‌జెండర్ వెల్ఫేర్ అకాడమీ ఏర్పాటు చేయాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న టిపిఎస్‌కే రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:**

తెలంగాణ ట్రాన్స్ జెండర్ హిజ్రా వెల్ఫేర్ అకాడమీ ఎర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆవరణలో తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రంలో శ్రీనివాస్ అద్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన టిపిఎస్‌కే రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత వివక్షకు గురై వర్గం ట్రాన్స్ జెండర్స్ కు బడ్జెట్ లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివక్ష చూపించి ఒక పైసా కేటాయించలేదని, వెంటనే తెలంగాణ లో మహిళ శిశు సంక్షేమ శాఖ నుండి వీడదీసి ప్రత్యేకంగా ట్రాన్స్‌జెండర్ హిజ్రా వెల్ఫేర్ అకాడమీ ఎర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రూ.1000కోట్లలను కేటాయించాలని, జిఏసి ట్రాన్స్ జెండర్ అరోగ్య సమస్యలు ప్రభుత్వాలే పట్టించుకోవాలని, ఈ సందర్భంగా తీర్మానం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లుతామని అన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి సర్కారు 32 మందికి మాత్రమే ట్రాఫిక్ కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేసారని, అర్హత కలిగిన వారందరికీ అవకాశాలు ఇవ్వాలని డిమాండ్ చేసింది ఈ సమావేశం లో ట్రాన్స్ జెండర్స్ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయాలని ట్రాన్స్ జెండర్ ఉత్సవాలు జరుపాలని చేసిన తీర్మాణాన్ని మంత్రి సీతక్క కు అందజేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్ జెండర్ గురువులు ప్రియా, నగ్మా అరతి,పప్పి సురేఖ తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా టిపిసిసి లేబర్ సెల్ నూతన నియామకాలు



నియామక పత్రాలు అందుకుంటున్న టిపిసిసి నూతన లేబర్ సెల్ సభ్యులు

**పేట్ బషీరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**

ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు బుధవారం టిపిసిసి లేబర్ సెల్ చైర్మన్ రాంబాగ్ ప్రకాష్ గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ గాంధీ భవన్‌లో జరిగిన టిపిసిసి లేబర్ సెల్ సమావేశంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నూతన లేబర్ సెల్ నియామకాలు చేపట్టడం జరిగింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా టిపిసిసి లేబర్ సెల్ ప్రధాన కార్యదర్శిగా కర్కాల ఉపేందర్ రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా టిపిసిసి లేబర్ సెల్ వైస్ ప్రెసిడెంట్‌గా మండల సంపత్ కుమార్ గౌడ్, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం టిపిసిసి లేబర్ సెల్ అధ్యక్షులుగా కావలి గోపాల్, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం టిపిసిసి లేబర్ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సాయిపేట మల్లేష్‌లను నియమించారు. అనంతరం టిపిసిసి లేబర్ సెల్ చైర్మన్ రాంబాగ్ ప్రకాష్ గౌడ్ నియామక పత్రాలను అందజేశారు. మాపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చిన టిపిసిసి లేబర్ సెల్ చైర్మన్ ఆర్. ప్రకాష్ గౌడ్‌కి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు కాందాడి సుదర్శన్ రెడ్డికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో కార్మిక విభాగం బలోపేతం చేస్తు కార్మికుల సామాజిక న్యాయం సమస్యలు పరిష్కారానికి పోరాడతామని అలాగే భవన నిర్మాణ ఇతర నిర్మాణ రంగ కార్మికులు, సంఘటిత, అసంఘటిత రంగాలకు చెందిన అర్హులైన కార్మికుల సమస్యలు పరిష్కారానికై కృషి చేస్తామని టిపిసిసి లేబర్ సెల్ తరపున తమ వంతు సేవ కార్యక్రమాలు చేపడుతామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి లేబర్ సెల్ నాయకులు సుజీత్ గాంధీ ( లేబర్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి) సప్పిడి భాస్కర్ (కో ఆర్డినేటర్ సోషల్ మీడియా), సాయిపేట శ్రీనివాస్, అశోక్ రెడ్డి, నవీన్ ముదిరాజ్, ప్రశాంత్, గుండా వినోద్ కుమార్, ఎండీ నయీమ్, సన్నీ, దనేష్ పాల్గొన్నారు.

